క్లుప్తంగా

18, 19 తేదీల్లో రక్తదాన శిబిరాలు

చింతూరు: మండలంలోని ఈనెల 18న రంపచోడవరం, 19న చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్టు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రధాన కార్యదర్శి గౌరీశంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగరాజు, వైస్ ఛైర్మన్ గంగరాజు శుక్రవారం తెలిపారు. ఎన్ఎస్ఎస్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ రక్తదాన శిబిరాల్లో ఆయా ప్రాంతాల ఔత్సాహిక యువత పాల్గొని రక్తదానం చేయాలని వారు కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి


గ్రామస్తులతో మట్లాతున్న సర్పంచ్ రామారావు

వి.ఆర్.పురం: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తనకు తెలియజేస్తే అధికారుల పరిశీలనకు తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చిన్నమట్టపల్లి సర్పంచ్ పిట్టా రామారావు, పీసా సంఘం మండల అధ్యక్షుడు జయరాజ్ తెలిపారు. వెంకంపాలెం గ్రామస్తులతో వారు మాట్లాడారు. నాయకులు నాగేశ్వరరావు, రమేష్, బుచ్చయ్య, భద్రయ్య, దుర్గారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలపై అవగాహన


కుమడలో పోస్టల్ సేవలపై అవగాహన కల్పిస్తున్న ఎంవో శ్రీను

ముంచంగిపుట్టు: పోస్టల్ పొదుపు ఖాతాలతో ఆర్థిక భరోసా లభిస్తుందని పెదబయలు పోస్టల్‌శాఖ ఎంవో ఎం.శ్రీను అన్నారు.మండలంలోని కుమడ పంచాయతీ కేంద్రంలో శుక్రవారం పోస్టల్ శాఖలో పొదుపు ఖాతాలు, బీమాలపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. పోస్టల్ శాఖా అందిస్తున్న బీమాలు, వాటి వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. పదేళ్ల సంవత్సరాలలోపు ఆడ పిల్లలకు సుకన్య సమృద్ధి యోజన పథకం ఎంతో రక్షణగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎంవో శ్రీను మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే పోస్టాఫీసుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్‌బీ, ఆర్‌డి, పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ, ఐపీపీబీ వంటి ఖాతాలు తెరిచి, వడ్డీలు పొందవచ్చన్నారు. అనంతరం గిరిజనులతో పొదుపు ఖాతాలను తెరిపించారు. కుమడ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ కొండబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అసంపూర్తి పనులతో అవస్థలు


అచ్చియ్యపేట కల్వర్టు వద్ద అసంపూర్తి పనులు

అడ్డతీగల: మండలంలోని అచ్చియ్యపేట వద్ద జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా అడ్డతీగల–రాజవొమ్మంగి మార్గంలోని వీరభద్రపురం వద్ద అసంపూర్తిగా ఉన్న కల్వర్టు పనులతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. జాతీయ రహదారి 516–ఇ నిర్మాణంలో భాగంగా వీరభద్రపురం గ్రామానికి వెళ్లేందుకు కల్వర్టు నిర్మించారు. అయితే ఈ నిర్మాణం వల్ల రహదారి మరింత ఇరుకుగా మారిందని, కనీసం ట్రాక్టర్ వెళ్లే పరిస్థితి లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ మార్గంలో రాతి కట్ట పనులు పూర్తి స్థాయిలో చేపట్టకుండా వదిలేయడంతో కోతకు గురవుతుందని, ప్రమాదాలు జరిగే ఆస్కారముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడితే సమీప కొండలపై వచ్చే నీరు ఈ మార్గాన్ని ముంచేత్తే ప్రమాదముందని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

26న అఖండ దీపారాధన

అనకాపల్లి టౌన్: స్థానిక లక్ష్మీదేవిపేట ఆది శివలింగాలయంలో మహా శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ ఉపాధ్యక్షుడు సద్గురు రాజర్షి ఆత్మానంద స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న మహా శివరాత్రి సందర్భంగా ఆలయంలో 11 అడుగుల శివలింగానికి అఖండ దీపారాధన, సాయంత్రం 108 నక్షత్రమాల దీపజ్యోతులు వెలిగించడం, కోలాట బృందాలచే సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ద్వాదశ శివలింగాలకు ప్రత్యేక పూజలు, అనంతరం మహారుద్రాభిషేకం, ప్రవచనాలు, భజన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

ఇద్దరు జూదరులపై కేసు నమోదు

అనకాపల్లి: గోపాలపురంలో జూదమాడుతున్న ఇద్దరిని అదుపులోనికి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.1820 స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ రవికుమార్ శుక్రవారం తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.


సంతలో కల్తీ నూనెల అమ్మకాలు


సంతలో నాసిరకం పప్పుల అమ్మకాలు

దర్జాగా కల్తీ దందా

మన్యంలోని వారపు సంతలు గిరిజనులకు సూపర్ మార్కెట్లుగా చలామణీ అవుతుంటాయి. శివారు ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు తమకు కావల్సిన నిత్యావసరాలు... కూరగాయలు, ఇతరత్రా వస్తువులను అధిక మొత్తంలో ఇక్కడే కొనుగోలు చేసుకుంటారు. అయితే సంతల్లో కల్తీ, నకిలీ వస్తువుల వ్యాపారం జోరుగా సాగుతోంది. కల్తీ వస్తువుల వినియోగంతో అమాయక గిరిజనులు అనారోగ్యం బారిన పడుతున్నారు. నిబంధనలు పాటించకుండా వ్యాపారులు దర్జాగా దందా సాగిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం.. గిరిజనుల పాలిట శాపంగా మారింది.

పెదబయలు: వారపు సంతల్లో నకిలీ, కల్తీ వ్యాపారం జోరుగా సాగుతోంది. అగ్‌మార్క్ ఉన్న వస్తువులు అమ్మకాలు చేయాలనే నిబంధనలను వ్యాపారులు కనీసం పాటించడం లేదు. నిత్యావసరాలు, కొబ్బరినూనెలు, కాస్మెటిక్స్ ఇలా అన్ని రకాల వస్తువులు కల్తీవే దర్శనమిస్తుంటాయి.. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వ్యాపారులు దర్జాగా దందా సాగిస్తున్నారు. దీంతో అమాయక గిరిజనులు తీవ్రంగా మోసపోతున్నారు. అనారోగ్యం బారిన పడుతున్నారు. వంట నూనెలు, సబ్బులు, కారం, పప్పులు, బ్యూటీ క్రీములు ఇలా సంతలో విక్రయించే ప్రతీ వస్తువు కల్తీవే ఉంటున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఒరిజనల్ కంపెనీ వస్తువులకు దీటుగా కల్తీ, నకిలీవి విక్రయిస్తుండడంతో నాణ్యమైన వస్తువుల విక్రయాల ఊసే లేకుండా పోయిందంటున్నారు. దళారులు, వ్యాపారుల ఆధ్వర్యంలో కోట్ల రూపాయల్లో వ్యాపారం జరుగుతోంది.


సంతలో నకిలీ వస్తువుల అమ్మకాలు

అనారోగ్యం బారిన గిరిజనం

గిరిజనులు సంతల్లో కొనుగోలు చేసే నకిలీ వస్తువుల వల్ల గిరిజనులు మోసపోతున్నారు. దీంతో పాటు సంతల్లో కుల్లిన చేపలు, నిల్వ మాంసం అమ్మకాలు ఎక్కువ. ఇలాంటి కలుషిత ఆహార పదార్థాలను వినియోగించి గిరిజనుల అనారోగ్యానికి గురవుతున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు సంతల్లో అధికారులు

దాడులు చేసి ఒక్క కల్తీ సరుకు కూడా పట్టుకున్న దాఖలాలు లేవంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వ్యాపారులు, దళారుల దందా రోజు రోజుకూ పెరుగుతోందని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సంతల్లో కల్తీ, నకిలీ వ్యాపారానికి అడ్డుకట్ట వేసి, ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరముందని చెబుతున్నారు.

సంతల్లో జీసీసీ దుకాణాలు



వారపు సంతల్లో కల్తీ, నకిలీ వస్తువుల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. అధికారులు ఈ వ్యాపారాన్ని కట్టడి చేయాల్సిన ఆవశ్యకత ఉంది. వారపు సంతల్లో జీసీసీ దుకాణాలు ఏర్పాటు చేయాలి. ఈ దుకాణాల ద్వారా నాణ్యమైన వస్తువులు విక్రయించేలా చూడాలి. ఇక్కడ సంత సమీపంలో జీసీసీ సూపర్ బజార్ ఏర్పాటు కోసం ఉన్నతాధికారులు నివేదించారు. ఈ సూపర్ బజార్ అందుబాటులోకి వస్తే కల్తీ, నకిలీ దందాకు అడ్డుకట్ట వేయవచ్చు.

– మజ్జి చంద్రబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, పెదబయలు

ప్రతిపాదనలు పంపాం



పెదబయలులో వారపు సంతలో కల్తీ వ్యాపారం జరగకుండా చర్యలు తీసుకుంటాం. జీసీసీ కార్యాలయం కూడా సంత ప్రాంతంలోనే ఉంది. జీసీసీ సూపర్ మార్కెట్ ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నాణ్యమైన అన్ని రకాల సరకులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటాం.

–ఓలేసి గాసీ, జీసీసీ బ్రాంచ్ మేనేజర్, పెదబయలు మండలం

వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతమే లక్ష్యం


రామునాయుడును సన్మానిస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకులోయ టౌన్: అరకు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం అవుతుందని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. మండల కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ప్రతి కార్యకర్త ప్రజల కష్టాలను తెలుసుకొని, పరిష్కారానికి తమ వంతుగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ మేధావివర్గ విభాగ అధ్యక్షుడిగా నియమితులైన జర్సింగ రామునాయుడును అభినందించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ మరింత బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. ఆయనను ఎమ్మెల్యే శాలువా కప్పి సన్మానించారు. వైస్ సర్పంచ్ కిల్లో కామేశ్వరరావు, వార్డు సభ్యులు వి.గోవర్ధన్, వి.లక్ష్మయ్య, వి.అప్పన్నదొర, వి.దేవుడు, ఇంద్రకుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రైతుల వివరాల నమోదు


రైతుల వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

గంగవరం(అడ్డతీగల): గంగవరం మండలం బయ్యనపల్లిలో రైతుల వివరాల రిజిస్ట్రేషన్ ప్రక్రియని శుక్రవారం వ్యవసాయ అధికారి కె.విశ్వనాథ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు.రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుకు ప్రతి రైతు వివరాలు నమోదు చేయించుకోవాలని ఆయన చెప్పారు. వ్యవసాయ సేవలు సులభతరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఈ కార్యక్రమానిన రైతులు ఉపయోగించుకోవాలన్నారు. పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.

భక్తి శ్రద్ధలతో రాజులబాబుల పండగ


వేషధారణలో చిన్నారులు

రాజవొమ్మంగి: మండలంలోని ముర్లవానిపాలెంలో శుక్రవారం అడవి రాజులబాబుల పండుగను గిరిజనులు ఘనంగా జరుపుకొన్నారు. లవకుశలను గిరిజనులు తమ ఆరాధ్య దైవంగా భావిస్తూ రాజులబాబులుగా నామకరణంతో పూజలు చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ముర్లవానిపాలెంలోని తోటలో రాజులబాబు పండగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేడుకలో భాగంగా రోజంతా ఉపవాసం ఉన్న చిన్నారులను రాజులబాబుల (లవకుశలుగా) మాదిరిగా వేషధారణ చేసి, డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపుగా పండుగ జరిగే చోటుకు తీసుకెళ్లారు. తోటలోని ఎంపికైన చేసిన ఓ చెట్టుకు పసుపు, కుంకుమలు అద్ది దేవతామూర్తులు చిత్రపటాలను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. పండ్లు , పూలతో పాటు పొలంలో పండిన కొత్త ధినుసులతో వంటలు చేసి నైవేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.


దీప ధూపాలతో పసుపు కుంకులతో పూజలు చేశారు. అడవుల్లో సంచరించే తమను చల్లగా చూడాలని కోరుకొన్నారు. గ్రామానికి చెందిన గంగమ్మ, అప్పలరాజు ఆధ్వర్యంలో రాజులబాబు పండుగ ఘనంగా జరిగింది.

అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం పరామర్శ


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

డుంబ్రిగుడ: అరకులోయ జెడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోషిణి, భర్త కమ్మిడి అశోక్ నాన్నమ్మ అయిన కమ్మిడి రంభ అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మృతుడి కుటుంబ సభ్యులను శుక్రవారం కలిసి పరామర్శించారు. కమ్మిడి రంభ పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తోందన్నారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో అరకులోయ, డుంబ్రిగుడ మండల పార్టీ అధ్యక్షులు పి.పరశురామ్, స్వాభీ రామ్‌మూర్తి, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు శెట్టి గోపాల్, పోతంగి పంచాయతీ వైస్ సర్పంచ్ జగ్గునాయుడు, శెట్టి గాసి, నాయకులు చిరంజీవి, చిన్నబాబు, సుబ్బారావు తదితరులున్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి


కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, గ్రామస్తులు

కొయ్యూరు: మండలంలోని అంతాడ పంచాయతీ కొత్తపల్లిలో శుక్రవారం హిమగిరి గ్రామీణాభివృద్ధి సొసైటీ ఆధ్వర్యంలో గిరిజన మహిళల కోసం కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. సొసైటీ కార్యదర్శి ఎం.సత్తిబాబు మాట్లాడుతూ ఈ కేంద్రం ద్వారా మూడు నెలల పాటు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణ కాలం పూర్తయిన తరువాత సర్టిఫికెట్లు అందజేశామన్నారు. ఒక్కో బ్యాచ్‌లో 20 మందికి శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. రానున్న రోజుల్లో అన్ని ప్రాంతాల్లో కుట్టు శిక్షణ కేంద్రాలు ఏర్పాటుచేయనున్నట్టు పేర్కొన్నారు. పరిపాలన అధికారి భగవాన్ మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. లిఫ్ట్ గ్రామీణాభివృద్ధి సొసైటీ కార్యదర్శి ప్రసాద్, హెల్ప్ సంస్థ కార్యదర్శి శ్రీనుబాబు, రేవతి చారిటబుల్ సంస్థ ప్రతినిధి శివ, లిఫ్ట్ సంస్థ గౌరవ అధ్యక్షుడు అప్పారావు, డైరెక్టర్ నూకరాజు, మారుతి విలేజ్ ఫుడ్ డైరెక్టర్ శేషుబాబు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- పునర్నిర్మాణానికి నోచుకోని వంతెన రెయిలింగ్
- ఆందోళనలో వాహనచోదకులు
- పట్టించుకోని అధికారులు


అడ్డతీగల మండలం బొంగరాలపాడు వద్ద మదేరు వాగుపై ఉన్న వంతెనపై ధ్వంసమైన రెయిలింగ్

అడ్డతీగల: అడ్డతీగల–ఏలేశ్వరం రోడ్డులోని బొంగరాలపాడు వద్ద మదేరు వాగుపై ఉన్న వంతెన రెయిలింగ్ ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఈ మార్గంలో లారీ అదుపుతప్పి వంతెన రెయిలింగ్‌ని ఢీకొని వాగులో పడిపోయింది. ఈ సంఘటన జరిగి రెండేళ్లు కావస్తున్నా నేటి వరకు అధికారులు రెయిలింగ్ నిర్మాణంపై దృష్టి సారించలేదు. అడ్డతీగల–ఏలేశ్వరం రోడ్డులో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రిళ్లు ఈ వంతెనపై ప్రయాణించేందుకు వాహనచోదకులు భయపడుతున్నారు. వంతెనకు రెయిలింగ్ లేకపోవడంతో ఏ మాత్రం ఆదమరిచినా పెద్ద ప్రమాదం జరిగే ఆస్కారం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని బొంగరాలపాడు గ్రామస్తులతో పాటు వాహనచోదకులు కోరుతున్నారు.

పీసా చట్టంతో గిరిజనులకు రక్షణ


హుకుంపేటలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజుబాబు


రాజవొమ్మంగిలో మాట్లాడుతున్న అధికారి రమేష్


చింతూరులో శిక్షణ కార్యక్రమానికి హాజరైన కమిటీల సభ్యులు


ముంచంగిపుట్టులో పీసా చట్టంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు


అడ్డతీగలలో మాట్లాడుతున్న అధికారి


కొయ్యూరులో మాట్లాడుతున్న డీడీ రామనాథం

రాజవొమ్మంగి: పీసా చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఏపీఎస్ఐఆర్‌డీ పరిశీలనాధికారి రమేష్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పీసా చట్టంపై అవగాహన, శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రెండవ రోజు శుక్రవారం ఈ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. పీసా కమిటీ సభ్యులకు పలు అంశాలను విశదీకరించారు. పీసా చట్టం గిరిజనులకు రక్షణగా నిలుస్తోందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసుకొని అమలు చేయవచ్చన్నారు. తాగునీరు. విద్య, వైద్యం ఉపాధి తదితర అంశాలకు చెంది పీసా చట్టం గ్రామసభల ద్వారా నిర్ణయాలు తీసుకొనే అధికారం ఉందన్నారు. ఈనెల 22వ తేదీ వరకు జరుగనున్న శిక్షణ తరగతులకు సభ్యులు హాజరు కావాలని కోరారు. సామర్లకోట నుంచి వచ్చిన ఈటీసీ అబ్జర్వర్ పద్మజ, ఎంపీడీఓ యాదగిరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: పీసా చట్టంపై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించాలని చింతూరు ఎంపీడీవో రామకృష్ణ సూచించారు. మండలంలోని ముకునూరు, రామన్నపాలెం, పెదశీతనపల్లి గ్రామ పంచాయతీల పరిధిలో ఇటీవల ఎన్నికైన పీసా కమిటీల సభ్యులకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సవలం అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రామకృష్ణ మాట్లాడుతూ శిక్షణ ద్వారా గిరిజన చట్టాలను అమలు పరచడంలో కీలకపాత్ర పోషించాలన్నారు. సర్పంచ్‌లు బీరబోయిన సత్యకుమారి, మడివి అమ్మాజీ, మడకం వెంకటలక్ష్మి, సోడె నారాయణ తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటు ప్రజా సమస్యలను తీరుస్తు బాధ్యతగా పని చేస్తే భవిష్యత్‌లో మంచి గుర్తింపు ఉంటుందని ఎంపీపీ కూడా రాజుబాబు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం పీసా చట్టం నియామవళి, అమలుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతు పీసా చట్టం ద్వారా గిరిజనుల హక్కులు, చట్టం ప్రకారం సమస్యలు తీర్చేందుకు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. తమ పరిధి గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతీ సమస్య పరిష్కరించాలన్నారు. ఎంపీడీవో రమాదేవి, శిక్షణ అధికారి మోహన్‌రావు, ఏవో సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: పీసా చట్టం నియమావళిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యనారాయణ మూర్తి అన్నారు. పీసా చట్టం అమలు తదితర అంశాలపై అన్ని పంచాయతీల నుంచి 200 మందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. పీఆర్ ఏఈఈ మురళీకృష్ణ, పంచాయతీ విస్తరణ అధికారి చిన్నాన్న, పంచాయతీ కార్యదర్శులు సింహాచలం, ప్రవీణ్‌కుమార్, సత్యరంజన్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పీసా కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: పీసా చట్టాలు, హక్కులపై ప్రతీ ఒక్కరికీ అవగాహన ఉండాలని ఎంపీపీ బడుగు రమేష్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం పీసా చట్టాల నియమావళి, అమలుపై శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో చేపట్టే పనులపై పీసా కమిటీ తీర్మానం ఉండాలన్నారు. ఏపీఎస్ఐఆర్‌డీ డిప్యూటీ డైరెక్టర్ జి.రామనాథం మాట్లాడుతూ శిక్షణ ద్వారా అవగాహన పెంచుకోవాలని కోరారు. ఎంపీడీవో ఎస్‌కె ప్రసాద్ పాల్గొన్నారు

అడ్డతీగల: పంచాయితీరాజ్ వ్యవస్థలో పెస గ్రామ కమిటీలు కీలకమని ఎంపీడీఓ కెఆర్ విజయ అన్నారు.అడ్డతీగల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పెస గ్రామకమిటీల శిక్షణకు 60 మంది హాజరయ్యారు.సామర్లకోట ఎంప్లాయిస్ ట్రైనింగ్ సెంటర్ రిసోర్స్‌పర్సన్‌లతో వివిధ అంశాలపై శిక్షణలో తెలియజేశామన్నారు. అటవీ హక్కుల చట్టం అమలులో ఎటువంటి పాత్ర వహించాలో పలు అంశాలను వివరించారు. అటవీ ఉత్పత్తుల ధరలు,అమ్మకాలపై స్వయం నిర్ణయాధికారం తీసుకోవచ్చన్నారు.సహజ వనరుల వినియోగంపై హక్కు కలిగి ఉంటారన్నారు. పెస గ్రామకమిటీల ఉపాధ్యక్షులు,కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గాలమ్మ తల్లి పండగ

దేవరాపల్లి: మండలంలోని ముషిడిపల్లిలో గ్రామ దేవత దుర్గాలమ్మ అమ్మవారి ఒడ్డు పండగ శుక్రవారం వైభవంగా జరిగింది. ముందుగా గ్రామస్తులంతా పసుపు, కుంకుమలతో గ్రామ పురవీధుల్లో కోలాటం, తప్పెటగుళ్లు తదితర సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో నిర్వహించిన భారీ అన్నసమారాధనలో భక్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మహా ప్రసాదం స్వీకరించారు.

రేపు సంకటహర చతుర్థి వ్రతం

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామమైన సిరసపల్లి చింతామణి గణపతి దత్తక్షేత్రంలో ఈ నెల 16న సంకటహర చతుర్థి పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు దత్తక్షేత్రం నిర్వాహకుడు ఆంజనేయరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో దత్త లైలాభిషేకాలు, సహస్ర దూర్వార్చన, గణపతి హోమం, సంకటహర గణపతి వ్రతంలో పాల్గొనే భక్తులు ముందుగా ఆలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.